



# కరపత్రం

SINCE 2014

శుక్రవారం మార్చి 13, 2026 | సంపుటి : 2 | సంచిక : 152 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## హైదరాబాద్‌లో నెట్‌ఫ్లిక్స్ స్టూడియో

» ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి » ఫ్యూచర్‌సిటిలో ఏర్పాటుకు భూమి కేటాయిస్తామని ప్రకటన

హైదరాబాద్,మార్చి12 :
నెట్‌ఫ్లిక్స్‌ను హైదరాబాద్‌కు ఆహ్వానిస్తున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ అన్ని అవకాశాలను కల్పిస్తుందని, తమ ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని చెప్పారు. హైటెక్‌సిటీలోని నెట్‌ఫ్లిక్స్‌కు చెందిన ఐలైన్ స్టూడియోస్ కార్యాలయాన్ని సీఎం రేవంత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాల్యం నుంచే తనకు సినిమాలు అంటే ఇష్టం ఇష్టమన్నారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్‌కు వచ్చిందంటే హాలీవుడ్ నగరానికి వచ్చినట్లే అని సీఎం వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్‌తో తన కల నిజం కాబోతోందని వ్యాఖ్యానించారు. నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ విస్తరణకు తమ ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఫోర్త్‌సిటీని నిర్మిస్తున్నామని.. నెట్‌ఫ్లిక్స్ విస్తరణకు కావాల్సిన భూమిని ఫ్యూచర్ సిటీలో ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. నెట్‌ఫ్లిక్స్ కార్పొరేట్ ఆఫీస్‌ను ఫ్యూచర్ సిటీకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమానికి పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి డి. శ్రీధర్‌బాబు, సినీనటుడు రానా దగ్గుబాటి, నెట్‌ఫ్లిక్స్ ఐలైన్ స్టూడియోస్ సీఈఓ జెఫ్ షాపిరో, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. తనకు సినిమాలపైన ఆసక్తి ఉందని.. తన బాల్యం నుంచి ఇప్పటి వరకు చిత్రరంగంలో అనేక మార్పులు వచ్చాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బాహుబలి, కల్కి, ఆర్ఆర్ఆర్, అరుంధతి వంటి అత్యున్నత సాంకేతికతతో కూడిన సినిమాలు వచ్చాయని చెప్పుకొచ్చారు. చెన్నైలో ఉన్న తెలుగు సినిమా రంగాన్ని నందమూరి తారక రామారావు , అక్కినేని నాగేశ్వరరావు హైదరాబాద్‌కు తీసుకువచ్చారని గుర్తుచేశారు. నెట్‌ఫ్లిక్స్ హైదరాబాద్ వచ్చిందంటే హాలీవుడ్ వచ్చినట్లేనని పేర్కొన్నారు. తమ దృష్టి హాలీవుడ్‌పైనేనని తాను గతంలోనే చెప్పానని ప్రస్తావించారు. ప్రపంచంలోని 500 పెద్ద కంపెనీలను తెలంగాణకు తీసుకురావడానికి తాము ప్రయత్నం చేస్తున్నామని వివరించారు. తెలంగాణలో మీ పెట్టుబడికి పూర్తి రక్షణ ఉంటుందని.. తమ రాష్ట్రం అంటేనే వ్యాపారమని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.



## యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే



- అప్పుడే యుద్ధ విరమణకు అంగీకరిస్తాం
- ఇరాన్ విషయంలో దుందుడుకు చర్యలు అంగీకరించం
- ప్రపంచానికి తేల్చిచెప్పిన ఇరాన్ నాయకత్వం
- పరస్పరదాడులతో కొనసాగుతున్న ఉద్రిక్తతలు
- రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి
- మరిన్ని దాడులు చేస్తామంటూ ట్రంప్ హెచ్చరికలు

టెహ్రాన్,మార్చి12 :
ఇరాన్ వర్సెస్ ఇజ్రాయెల్, అమెరికా దేశాల మధ్య యుద్ధం 13వ రోజుకు చేరుకుంది. ఇజ్రాయెల్, అమెరికా దేశాలు సంయుక్తంగా ఇరాన్‌పై మిస్సైల్స్, డ్రోన్లతో దాడులు చేస్తున్నాయి. ఈ దాడుల్లో ఇప్పటి వరకు 1300 మంది ఇరానీయులు చనిపోయినట్లు తెలుస్తోంది. ఇరాన్ కూడా ఏమాత్రం వెనక్కు తగ్గటం లేదు. రెండు దేశాలపై విరుచుకుపడుతోంది. అరబ్ దేశాలలోని అమెరికా ఎయిర్‌బేస్‌లపై దాడులు చేస్తోంది. యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయిల్, గ్యాస్ ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న వేళ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ కీలక ప్రకటన చేశారు. యుద్ధానికి ముగింపు పలకాలంటే తమ షరతులకు అంగీకరించాల్సిందేనని తేల్చి చెప్పారు. భవిష్యత్‌లోనూ తమ దేశంపై ఎవరూ దాడులు చేయకూడదని అన్నారు. తమ న్యాయపర హక్కులను ప్రపంచం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. పశ్చిమాసియాలో శాంతి, భద్రతలకు ఇరాన్ కట్టుబడి ఉందన్నారు.

మిగతాది 2లో



## గ్యాస్ కొరతపై విపక్షాల ఆందోళన

» పార్లమెంటు నుంచి బయటకు చేరిన నిరసనలు
» మకరద్వారం ముందు విపక్ష ఎంపిల నిరసన ప్రదర్శన

న్యూఢిల్లీ,మార్చి12 :
'మోడీజి -ఎల్‌పిజి' అంటూ ప్రతిపక్షాలు గురువారం పార్లమెంటు ఎదుట ఆందోళన చేపట్టారు. కమరిషయల్ ఎల్‌పిజి సిలిండర్ల కొరతపై మోడీ ప్రభుత్వం సమాధానమివ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, డిఎంకె, టిఎంసి, ఎసి సహా పలువురు ఎంపిలు మకరద్వారం ఎదుట ఆందోళన చేపట్టారు. 'నామ్ నరేందర్, కామ్ సరెండర్', 'మోడీజి, ఎల్‌పిజి' అంటూ నినాదాలు చేశారు. ప్రియాంక వాద్రా గాంధీ సహా పలువురు మహిళా ఎంపిలు ఇటుకల పొయ్యిలను ప్రదర్శించారు.

2లో..



## రైతు భరోసాను రూ.12 వేలకే పరిమితం చేశారు - రామచందర్ రావు

హైదరాబాద్:
సీఎం రేవంత్‌రెడ్డికి భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు లేఖ రాశారు. రైతు భరోసాను ఏడాదికి ఎకరాకు రూ.15 వేలకు పెంచుతామని హామీ ఇచ్చారని.. కానీ రూ.12 వేలకే పరిమితం చేశారని అందులో పేర్కొన్నారు. దాన్ని కూడా సమయానికి ఇవ్వడం లేదని చెప్పారు. యాసంగి పంట రైతు భరోసా రాక రైతులు అప్పుల పాలవుతున్నారని తెలిపారు. "ప్రాజెక్టుల నీళ్లు కాల్వలకు రాక పంటలు ఎండిపోతున్నాయి. అప్పులతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

## నీటి వినియోగంలో జాగ్రత్తత్తుల ముఖ్యం

- భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలి
- రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చే యత్నం
- జగన్ హయాంలో పెట్టుబడిదారుల పరార్
- జిల్లాల వారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు
- సంపద సృష్టిస్తేనే మెరుగైన సమాజం సాధ్యం
- రెండోరోజు కలెక్టర్ల సదస్సులో సిఎం చంద్రబాబు

అమరావతి,మార్చి12 :
నీటిని సక్రమంగా వినియోగించుకుంటేనే ప్రయోజనం ఉంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. భవిష్యత్ తరాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన రెండో రోజు కలెక్టర్ల సదస్సు ప్రారంభమైంది. పెట్టుబడులు, వైద్యం, సూపర్ సిక్స్- సంక్షేమం, ఆదాయార్జన శాఖలు, విద్య- నైపుణ్యాభివృద్ధి తదితర అంశాలపై చర్చిస్తున్నారు.



2లో



## కాశ్మీర్ మాజీ సిఎం ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం

- తృటిలో తప్పించుకున్న మాజీ ముఖ్యమంత్రి
- తనది 20 ఏళ్ల పగ అన్న దుండగుడు

జమ్ము,మార్చి12 :
జమ్మూకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం జరిగింది.

2లో



## పెరుగుతున్న ఎండల తీవ్రత

- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వైద్యులు

హైదరాబాద్,మార్చి12 :
తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మరింత వేడెక్కిస్తున్నాయి. ఉదయం 8 గంటలకే సూరీడు సుర్రుమంటున్నాడు. రాయలసీమ, గోదావరి జిల్లాల్లో ఎండలు తీవ్రం అవుతున్నాయి.

## 'గ్యాస్ బ్లాక్ మార్కెట్‌పై చర్యలు తీసుకోండి'



02

హైదరబాద్:
గ్యాస్ కొరత కారణంగా తెలంగాణ వ్యాప్తంగా 90 శాతం హోటళ్లు మూతపడే అవకాశం ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఏర్పడిన గ్యాస్ కొరతను తీర్చేందుకు చర్యలు తీసుకోవాలని కేటీఆర్ సూచించారు.

## 14నుంచి పదోతరగతి పరీక్షలు

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- సకాలంలో సెంటర్లకు చేరుకోవాలని సూచన
- ఐదు నిముషాల ఆలస్యానికి అనుమతి



హైదరాబాద్,మార్చి12 :
పదో తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 14 నుంచి ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు అధికారులు సకల ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షలు శనివారం ప్రారంభమై.. ఏప్రిల్ 16వ తేదీ వరకు జరుగుతాయి. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతాయి. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు.

మిగతాది 2లో

# యుద్ధ డిమాండ్లను అంగీకరించాల్సిందే

మొదటిపేజీ తరువాయి
అయితే, ఇరాన్ భద్రతకు గ్యారెంటీ ఇస్తేనే యుద్ధం ఆపుతామని చెప్పారు. రష్యా అధ్యక్షుడు పుతిన్, పాకిస్థాన్ ప్రధాని షహబాజ్ షరీఫ్‌తో ఫోన్‌లో మాట్లాడినపుడు కూడా ఇదే విషయం చెప్పామని అన్నారు. ఈ క్రమంలో పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు నానాటికీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా అమెరికా, దాని మిత్ర దేశాల నౌకలపై ఇరాన్ దాడులు తీవ్రమవుతున్నాయి. తాజాగా ఇరాక్ ప్రాదేశిక జలాల్లో రెండు ట్యాంకర్లపై 'సూసైడ్ బోటు'తో దాడి జరిగింది. ఈ ఘటనలో ఓ భారతీయుడు మృతిచెందడం గమనార్హం. పర్షియన్ గల్ఫ్‌లో ఇరాక్ తీరం సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దాడికి గురైన నౌకలను అమెరికాకు చెందిన సేఫ్‌సీ విష్ణు, గ్రీస్‌కు చెందిన జెఫిరోస్‌గా గుర్తించారు. సేఫ్‌సీ విష్ణు నౌక మార్షల్ ఐలాండ్స్ జెండాతో ఉండగా.. జెఫిరోస్‌పై మాల్టా జెండా ఉంది. ఈ నౌకలు తీరంలో చమురు సేకరిస్తుండగా పేలుడు పదార్థాలతో ఉన్న 'సూసైడ్ బోటు' వీటిని ఢీకొట్టినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో భారీగా పేలుడు సంభవించి పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రెండు నౌకల్లో ఉన్న 38 మంది సిబ్బందిని రెస్క్యూ టీం సభ్యులు కాపాడారు. ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయారు. మృతుడిని భారతీయుడిగా గుర్తించారు. అయితే, అతడి పూర్తి వివరాలు మాత్రం తెలియరాలేదు. ఈ దాడి తమ పనేనని ఇరాన్ (ఎసజీని) ప్రకటించింది. ఈ మేరకు తమ అధికారిక మీడియాలో వెల్లడించింది. ఫిబ్రవరి 28న పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైన నాటి నుంచి పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధి మార్గంలో ప్రయాణించే చమురు నౌకలపై దాడులు జరుగుతున్న సంగతి తెలిసిందే. బుధవారం కూడా మూడు కమర్షియల్ నౌకలపై డ్రోన్ దాడులు జరిగాయి. వీటిల్లో ఓ నౌక థాయ్ జెండాతో భారత్‌కు వస్తుండగా.. యూఏఈ తీరంలో దాడి జరిగింది. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తాబాకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ అమెరికా డిమాండ్లకు ఒప్పుకోవా లని ట్రంప్ స్పష్టం చేశారు. న్యూక్లియర్ వెపన్స్ ప్రోగ్రామ్‌ను ఇరాన్ పూర్తిగా ఆపేయాలన్నారు. అలా జరగని పక్షంలో చావు తప్పదని హెచ్చరించారు. ఫిబ్రవరి 28వ తేదీ లాంటి దాడులు మరోసారి జరుగుతాయని చెప్పారు. ఇజ్రాయెల్ సాయంతో మొజ్తాబాను చంపేస్తామని తేల్చి చెప్పారు.

# నీటి వినియోగంలో జాగ్రత్తల ముఖ్యం

మొదటిపేజీ తరువాయి
జిల్లాల వారీగా పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలను సీఎం అధికారులకు వివరించారు. రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్‌గా మార్చేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. సంపద సృష్టించేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలి. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఎలా ఉన్నామో జిల్లాల వారీగా వివరాలు ఉండాలి. గత వైకాపా హయాంలో పెట్టుబడులకు ఎవరూ ముందుకు రాలేదు. ఉన్న కంపెనీలు కూడా పారిపోయిన పరిస్థితి అందరం చూశాం. వనరులు ఉన్నా సరైన రీతిలో ఉపయోగించుకోవాలి. లేదంటే వ్యర్థమేనని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై సీఎం దిశానిర్దేశర చేశారు. సంపద సృష్టితో పాటు ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించారు. కుటుంబ సాధికారిత సాధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వివిధ పథకాల లబ్ధిదారులకు ప్రజా ప్రతినిధుల ద్వారా సంక్షేమ లేఖలు అందివ్వాలని సీఎం ఆదేశించారు. సంక్షేమ పథకాల పారదర్శకతతో అమలుకు, ఓనర్‌షిప్ తీసుకునేందుకు సంక్షేమ లేఖలు ఇవ్వాలని నిర్ణయించారు. పెట్టుబడుల గురించి ఆలోచించినట్లే... పేదల గురించి ఆలోచించాలని సూచించారు. త్వరలో సంక్షేమ క్యాలెండర్ విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. సంక్షేమ పథకాల అమలుకు సంబంధించి ఓ లేఖను లబ్దిదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు. లబ్దిదారులకు ప్రతీ నెలా ఏం లబ్ధి కలిగిందో తెలియజేయాలని సూచించారు. ఏ కుటుంబానికి ఏం లబ్ధి కలిగిందో తెలిస్తే అంతా పారదర్శకంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రభుత్వం అందించే పెన్షన్, ఉచిత సిలిండర్, తల్లికి వందనం, ఫీజు రీయింబర్స్‌మెంట్ లాంటివి లబ్దిదారులకు తెలియాలని సూచించారు. దీపం 2.0 పథకానికి డిజిటల్ ఓచర్ జారీ చేసే అంశాన్ని పరిశీలించాలని అన్నారు. డీబీటీ పథకాల్లో ప్రోగ్రామబుల్ వోచర్లను లబ్దిదారులకు ఇస్తే వారు వినియోగించుకుంటారన్నారు. మార్చి 9వ తేదీ నాటికి ఏపీఎస్ ఆర్టీసీ ద్వారా 50.45 కోట్ల ప్రయాణాలను మహిళలు చేశారని.. రూ.1775 కోట్లను ప్రభుత్వం ఆర్టీసీకి రీయంబర్స్ చేసిందని వివరించారు. డ్వాక్రా, మెప్మా సంఘాల సేవలను వినియోగించుకుని పీ4తో సహా జీరో పావర్టీ కార్యక్రమాన్ని సమర్థవంతంగా చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.
అన్నదాత సుఖీభవ ద్వారా రేపు మూడో విడత నిధులు విడుదల చేస్తున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అన్నాక్యాంటీన్ల ద్వారా 7.5 కోట్ల భోజనాలు ఇప్పటి వరకూ పేదలకు అందించగలిగామని చెప్పుకొచ్చారు. అంగన్‌వాడీ, ఆశాలకు గ్రాట్యూటీ అమలు చేస్తున్నామని అన్నారు. రూ. వెయ్యి కోట్లతో రోడ్ల మరమ్మతులు చేపట్టామని తెలిపారు. పల్లె పండుగ కింద గ్రామిణ ప్రాంతాల్లో రూ.4 వేల కోట్లు ఖర్చు చేశామని అన్నారు. సంక్షేమ పథకాలు పేదలందరికీ అందించడమే లక్ష్యంగా కలెక్టర్లు పనిచేయాలని మార్గనిర్దేశర చేశారు. సంక్షేమం, అభివృద్ధి సమతూకంగా జిల్లా కలెక్టర్లు పనిచేయాలని దిశానిర్దేశర చేశారు. ప్రతీ ఒక్కరికీ ఇంటిస్థలం లేదా ఇంటిని మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉగాదికి 2.50 లక్షల మందికి సామూహిక గృహప్రవేశాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ప్రతీ ఇంటికీ జేజేఎం కింద తాగునీటి కుళాయి ఇస్తామని... ప్రతి ఇంటికి ఇంటర్నెట్ అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. సాలిడ్, లిక్విడ్ మేనేజ్‌మెంట్ ద్వారా గ్రామాలు పరిశుభ్రంగా ఉంచాలని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. నెట్ జీరో కాన్సెప్టుగా ఘన వ్యర్థాలను వేస్ట్ టూ ఎనర్జీ ఎ÷–లాంట్లకు తరలించాలని ఆదేశించారు. తడి వ్యర్థాలను కంపోస్టు తయారు చేసేందుకు మళ్లించాలని సూచించారు. 500 పాఠశాలల్లో నెట్ జీరో కాన్సెప్టులో కిచెన్ గా÷–డ్గ÷న్, బయోడైవర్సిటీలో భాగస్వాములను చేయాలని సూచించారు. వీబీజీ రామ్ జీ కింద రూ.9773 కోట్లు ఏపీకి కేటాయించారని అన్నారు. ఇప్పుడు ఈ పథకం డిమాండ్ డ్రివెన్ కాదని... దీనికి అనుగుణంగా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పెట్టుబడుల గురించి ఎలా ఆలోచిస్తున్నామో... పేదలకు అందించే సంక్షేమం గురించి... వారికి కల్పించే సాధికారత గురించి కూడా కలెక్టర్లు ఆలోచించాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు.

# గ్యాస్ కొరతపై విపక్షాల ఆందోళన

మొదటిపేజీ తరువాయి
ప్రధాని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. పశ్చిమాసియా పరిస్థితులు, భారత్‌పై దాని ప్రభావంపై పూర్తి స్థాయిలో చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రధాని మోడీపై విరుచుకుపడ్డారు. ఎల్‌పిజి కొరతపై ప్రజలు ఆందోళన చెందవద్దని ప్రధాని పేర్కొన్నారని, కానీ 'పూర్తి భిన్నమైన కారణాల'తో ఆయన తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఎద్దేవా చేశారు. ఎప్‌స్టీపిన్స్గ÷ల్స్, అదానీ కేసులపై ప్రధాని ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. పార్లమెంటుకు వచ్చేందుకు కూడా మోడీ భయపడుతున్నారని, బుధవారం పార్లమెంటులో ఆయన కుర్చీ ఖాళీగా ఉండటం అందరం చూశామని అన్నారు. ప్రజలకు ఆందోళన చెందవద్దని చెబుతున్నారని, కానీ ఆయన ఆందోళనకు గురువుతన్నారన్నది స్పష్టమౌతోందని అన్నారు. గ్యాస్‌పై అబద్దాలాడుతున్న మోదీ సర్కారుగ్యాస్ కొరత
విషయంలో కేంద్రం తీరుపై కాంగ్రెస్ మండిపడింది. వాస్తవాన్ని ప్రజలకు చెప్పకుండా మోదీ సర్కారు అబద్ధమాడుతోందని కాంగ్రెస్ నాయకులు దుయ్యబట్టారు. ఎల్‌పీజీ కొరతపై సభలో చర్చకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ సభ్యులు పార్లమెంటు ముందు ప్రదర్శన నిర్వహించారు.

# కాశ్మీర్ మాజీ సిఎం ఫరూక్ అబ్దుల్లాపై హత్యాయత్నం

మొదటిపేజీ తరువాయి
ఓ వివాహ వేడుకలో నిందితుడు ఆయనపై కాల్పులకు పాల్పడేందుకు ప్రయత్నించాడు. వెంటనే భద్రతా సిబ్బంది అప్రమత్తమవడంతో.. ఫరూక్ సురక్షితంగా బయటపడ్డారు. 20 ఏళ్లుగా తాను ఫరూక్‌ను చంపాలనుకుంటున్నానని నిందితుడు పోలీసులతో పేర్కొన్నాడు. బుధవారం జమ్మూ శివార్లలోని హోటల్‌లో జరిగిన ఓ వివాహ వేడుకకు ఫరూక్ అబ్దుల్లా హాజరయ్యారు. ఆయనతో పాటు జమ్మూకశ్మీర్ డిప్యూటీ సీఎం సురీందర్ ఛౌదరీ కూడా ఉన్నారు. ఈ క్రమంలో ఓ వ్యక్తి వెనక నుంచి ఫరూక్‌పై పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో తుపాకీతో కాల్చేందుకు ప్రయత్నించాడు. అక్కడ ఉన్నవారు వెంటనే అతడిని పట్టుకొని చితకబాదారు. దీనికి సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు కూడా తాజాగా వెలుగులోకి వచ్చాయి. నిందితుడు జమ్మూకి చెందిన 63 ఏళ్ల కమల్‌సింగ్ జమ్వాల్‌గా పోలీసులు గుర్తించారు. జమ్మూలో దుకాణాలు నడుపుతోన్న కమల్ విచారణ సమయంలో కీలక విషయాలు వెల్లడించాడు. గత 20 ఏళ్లుగా తాను ఫరూక్ అబ్దుల్లాను చంపాలనుకుంటున్నానని పేర్కొన్నాడు. ఇది తన వ్యక్తిగత అజెండాగా వెల్లడించాడు. కాల్పులకు ఉపయోగించిన తుపాకీకి లైసెన్స్ ఉన్నట్లు తెలిపాడు. ఘటన సమయంలో నిందితుడు మద్యం మత్తులో ఉన్నాడని పోలీసులు పేర్కొన్నారు. తుపాకీని స్వాధీనం చేసుకున్నామని, ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. తన తండ్రిపై జరిగిన హత్యాయత్నంపై జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా స్పందించారు. లోడ్ చేసిన తుపాకీతో తన తండ్రిని ఓ వ్యక్తి కాల్చేందుకు ప్రయత్నించాడని పేర్కొన్నారు. అయితే, భద్రతా సిబ్బంది అప్రమత్తతతో అది విఫలమైందన్నారు. ఫరూక్‌కు జెడ్ ప్లస్ భద్రత ఉన్న విషయాన్ని ఒమర్ ప్రస్తావించారు. ఇంత భద్రత ఉన్నా.. నిందితుడు అంత దగ్గరగా ఎలా రాగలిగాడని ప్రశ్నించారు. ఇక, భద్రతా వైఫల్యం కారణంగానే ఈ ఘటన చోటుచేసుకుందని ఉప ముఖ్యమంత్రి ఛౌదరి పేర్కొన్నారు.

# పెరుగుతున్న ఎండల తీవ్రత

మొదటిపేజీ తరువాయి
తెలంగాణతో పాటు హైదరాబాద్ నగరంలో కూడా ఎండలు దంచికొడుతున్నాయి. భానుడి భగభగలతో నగర ప్రజలు విలవిల్లాడుతున్నారు. ప్రస్తుతం 40–42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే ఇలా ఉంటే.. ముందు ముందు పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణశాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని, బయటికి రాకుండా చూసుకోవాలి. రోజుకు తప్పని సరిగా నాలుగు లీటర్ల నీరు తాగితే డీహైడ్రేషన్ నుంచి బయట పడవచ్చు. పిల్లలపై ఎండ ప్రభావం పడకుండా పలుచని నూలు వస్త్రాలు ధరింపజేయాలి.ఉదయం 9 గంటలకే ఎండ వేడిమి అధికం కావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. అతి ముఖ్యమైన పని ఉంటేనే బయటకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం సమయంలో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. ఎండల నుంచి రక్షణ పొందేందుకు కొన్ని జాగ్రత్తలు పాటించాలి వైద్యులు సూచిస్తున్నారు. ఈ ఎండాకాలంలో మనుషులతో పాటు, పశవులకు కూడా ఆరోగ్య చర్యలు అవసరమని సూచిస్తున్నారు. ఎండను తాళలేక కొందరు ఎక్కువ సార్లు స్నానం చేయడం మంచిది కాదు. శరీరం బలహీనపడుతుంది. ఒక్కోసారి శరీరం ఉష్ణోగ్రతలు ఉండాల్సిన దానికంటే దిగువకు పడిపోతాయి. దీంతో స్పృహకోల్పోవడం, ఒక్కోసారి ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. డీహైడ్రేషన్‌కు గురికుండా ఉండేందుకు ఎక్కువ సార్లు నీరు తాగాలి. బయటకు వెళ్లేవారు వెంట మంచి నీరు తీసుకెళ్లాలంటున్నారు. దాహర్తిని తీర్చేందుకు పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు, శీతల పానీయాలు తాగడం ఆరోగ్యానికి మంచిది. వడదెబ్బకు గురికాకుండా ఉండేందుకు ముఖ్యమైన పనులపై బయటికి వెళ్లేవారు తప్పని సరిగా తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వేసుకొని వెళ్లాలని, పాదరక్షలు ధరించాలని వైద్యులు సూచిస్తున్నారు.

# దేశంలో గ్యాస్ సంక్షోభం

పశ్చిమాసియా సంక్షోభ నేపథ్యంలో దేశంలో వంటగ్యాసు (ఎల్‌పీజీ) ఏజెన్సీల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. ముఖ్యంగా వాణిజ్య సిలిండర్లను నల్లబజారులో కొనాల్సిన పరిస్థితి తలెత్తింది. నల్లబజారులో గ్యాస్ విక్రయాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టినట్టు కేంద్రం ప్రకటించింది. ఎల్పీజీ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని 21 రోజుల నుంచి 25 రోజులకు పెంచింది. వాణిజ్య సిలిండర్ల సరఫరాను సమీక్షించేందుకు చమురు మంత్రిత్వశాఖ ఓ కమిటీని ఏర్పాటుచేసింది. బుక్ చేసిన రెండున్నర రోజుల వ్యవధిలో గృహ వినియోగదారులకు సిలిండర్ అందజేసే విధానాన్ని కొనసాగిస్తున్నా మని తెలిపింది. వంటగ్యాసు సమస్యపై కేంద్ర ప్రభుత్వం హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన కీలక సమావేశం నిర్వహించింది. గృహ వినియోగదారులకే అత్యధిక ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలంది. ముంబయి, దిల్లీ, బెంగళూరు సహా దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హోటళ్లు, రెస్టారెంట్లు 'తాత్కాలికంగా' మూతబడటం ప్రారంభమైంది. దేశంలో చమురు, ఎల్పీజీ నిల్వలు సరిపడా ఉన్నాయని కేంద్రం చెబుతున్నప్పటికీ.. పలు ప్రాంతాల్లో కొరత ఆందోళన కలిగిస్తోంది. హోటళ్లు ప్రత్యామ్నాయ ఇంధనంపై దృష్టి సారిస్తున్నాయి. ఆలయాలు, మఠాలపై సైతం వంటగ్యాసు కొరత ప్రభావం కనిపిస్తోంది. అయోధ్యలోని ప్రసిద్ధ అమావా ఆలయంలో 'రామ్ రసోయీ' అన్నదాన కేంద్రాన్ని తాత్కాలికంగా మూసివేశారు. మైక్రోవేవ్ అవెన్‌లు, ఇండక్షన్ ప్లేట్ల వాడకం ప్రారంభించాలని ఐఆర్‌సీటీసీ పశ్చిమ జోన్‌లోని కేటరింగ్ యూనిట్లను ఆదేశించింది.

# నిరసలను లెక్క చేయని అమెరికా అధ్యక్షుడు వాణిజ్య సుంకాలపై కోర్టు తీర్పు బేఖాతర్

## – సెక్షన్ 301 తో దాడికి దిగబోతున్న ట్రంప్

ప్రపంచ దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఎడాపెడా విధించిన సుంకాలు చెల్లవంటూ అగ్రరాజ్య సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన క్రమంలో ట్రంప్ కొత్త ఎత్తులు వేస్తున్నారు. యుద్ధంతో దేశీయంగా తీవ్ర నిరసనలు వస్తున్నా లెక్క చేయడం లేదు. ఇతరదేశాలపై ఎలాగైనా టారిఫ్‌లు వసూలుచేయాలని కంకణం కట్టుకున్న ట్రంప్.. ఇందుకోసం కొత్తదారులు వెతుకుతున్నారు. తాజాగా 'సెక్షన్ 301' ఆయుధాన్ని బయటకు తీశారు. దీనికింద భారత్, చైనా సహా 16 వాణిజ్య భాగస్వామ్య దేశాలపై దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు అమెరికా వాణిజ్య శాఖ ప్రతినిధి జెమిసన్ గ్రీర్ కీలక ప్రకటన చేశారు. 1974 వాణిజ్య చట్టంలోని సెక్షన్ 301 కింద.. భారత్, చైనా, యూరోపియన్ యూనియన్, సింగపూర్, స్విట్జర్లాండ్, నార్వే, ఇండోనేసియా, మలేసియా, కాంబోడియా, థాయ్‌లాండ్, దక్షిణ కొరియా, వియత్నాం, తైవాన్, బంగ్లాదేశ్, మెక్సికో, జపాన్ దేశాలపై ఈ దర్యాప్తు జరగనుందని గ్రీర్ వెల్లడించారు. కాగా.. ఈ జాబితాలో కెనడా లేకపోవడం గమనార్హం. ఇతర దేశాలు అనుసరిస్తున్న అన్యాయమైన వాణిజ్య విధానాలను సవాలు చేసేందుకు అమెరికాకు ఉన్న శక్తిమంతమైన ఆయుధమే ఈ సెక్షన్ 301. తమ వాణిజ్య భాగస్వాములు అనుసరిస్తున్న ట్రేడ్ పాలసీలు అమెరికా వ్యాపారాలు, ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నాయా? అనేదానిపై ఈ చట్టం కింద అమెరికా దర్యాప్తు చేసేందుకు వీలు లభిస్తుంది. ఒకసారి దర్యాప్తు ప్రారంభించిన తర్వాత.. అన్యాయమైన వాణిజ్య విధానాలపై అగ్రరాజ్యం సాక్ష్యాలను సేకరించే పనిలో ఉంటుంది. ఏదైనా దేశం తమకు నష్టం కలిగించేలా ట్రేడ్ పాలసీలను అనుసరిస్తుందని తేలితే.. ప్రపంచ వాణిజ్య సంస్థ అనుమతి లేకుండానే ఆ దేశంపై ఏకపక్షంగా చర్యలు తీసుకునేందుకు ఈ చట్టం కింద అధికారం ఉంటుంది. అలాంటి దేశాలపై చట్టబద్ధంగా భారీ సుంకాలు విధించడం లేదా ప్రతీకార చర్యలు తీసుకునేందుకు అమెరికాకు మార్గం లభిస్తుంది. చైనా లాంటి ప్రత్యర్థులతో పాటు భారత్ వంటి మిత్రపక్షాల పైనా అమెరికా ఈ దర్యాప్తు చేపట్టడం చర్చకు దారితీసింది. భారత్‌లోని కొన్ని వాణిజ్య విధానాల వల్ల మన మార్కెట్లపై అమెరికాకు పరిమితులు ఉంటున్నాయని చాలాకాలంగా అగ్రరాజ్యం ఆందోళన వ్యక్తంచేస్తోంది. కొన్ని ఉత్పత్తులపై భారత్ అమలుచేస్తోన్న అధిక సుంకాలు, స్థానిక తయారీ, డేటా స్టోరేజీ, టెక్నాలజీ నిబంధనలు వంటివాటిపై అమెరికా అభ్యంతరాలు తెలుపుతోంది. ఈ అంశాల పైనే కొన్నేళ్లుగా ఇరుదేశాల మధ్య వాణిజ్య చర్చలు జరుగుతున్నాయి. అయితే, తాజా దర్యాప్తుతో భారత్‌పై వెంటనే పెనాల్టీలు పడే అవకాశం లేనప్పటికీ.. భవిష్యత్తులో కొన్ని రంగాలపై ఇది ప్రతికూల ప్రభావం చూపించే ప్రమాదం ఉంది. దీంతో ఆయా రంగాల నుంచి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

# న్యాయవ్యవస్థలో అవినీతి రచయితలు

## – వారిని దూరంపెట్టాలన్న సుప్రీం ధర్మాసనం

జాతీయ విద్యా పరిశోధనా శిక్షణ మండలి ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సాంఘిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో 'న్యాయ వ్యవస్థలో అవినీతి' పాఠ్యాంశాన్ని చేర్చేందుకు కారకులైన వారిపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ ముగ్గురు నిపుణులతో ఇకపై ఎలాంటి సంబంధాలు కొనసాగించొద్దని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. న్యాయ వ్యవస్థలో నెలకొన్న అవినీతి గురించి వివాదాస్పద అంశంగా పాఠ్యపుస్తకంలో చేర్చడంపై ఎన్‌సీఈఆర్‌టీ.. సర్వోన్నత న్యాయస్థానానికి బేషరతుగా క్షమాపణలు చెప్పడంతో పాటు ఆ పుస్తకాన్ని ఉపసంహరించుకున్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ వివాదాస్పద పాఠ్యాంశాన్ని ప్రొ.మైఖేల్ డానినో సహా టెక్ట్సుబుక్ డెవలప్‌మెంట్ టీమ్ సభ్యులు సుపర్ణ దివాకర్, అలోక్ ప్రసన్న కుమార్‌లు రూపొందించారని ప్రభుత్వం తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. 'ప్రొ.మైఖేల్ డానినో, ఆయన సహచరులు సుపర్ణ దివాకర్, అలోక్ ప్రసన్న కుమార్‌లకు భారత న్యాయవ్యవస్థను గురించిన సరైన పరిజ్ఞానం లేకుండా ఉండాలి, లేదా విద్యార్థుల ముందు న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దిగజార్చేందుకు వాళ్లు ఉద్దేశపూర్వకంగానే వాస్తవాలను వక్రీకరించి తప్పుగానైనా చూపించి ఉండాలి' అని పేర్కొంది. ఇకపై రాబోయే తరం విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాల రూపకల్పన ప్రక్రియలో ఆ ముగ్గురి ప్రమేయం ఉండకూడదని, వారిని తక్షణమే పక్కనపెట్టాలని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ నిధులతో పూర్తిగా లేదా పాక్షికంగా సంబంధమున్న ఎలాంటి బాధ్యతలనూ అప్పగించకూడదని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

# 14నుంచి పదోతరగతి పరీక్షలు

మొదటిపేజీ తరువాయి
అయితే పరీక్షలకు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అనుమతిస్తారు. ఆ తర్వాత వచ్చే వారిని అస్సలు అనుమతించబోరు. అంటే ఉదయం 9:35 గంటల తర్వాత వచ్చే విద్యార్థులను పరీక్షకు అనుమతించబోరు. విద్యార్థులు గంట ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని అధికారులు సూచించారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,676 సెంటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ బడుల్లో 1,582 సెంటర్లు, ప్రైవేట్ బడుల్లో 1,094 సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సారి 5,17,727 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. పరీక్షల సందర్భంగా సెల్‌ఫోన్ల వినియోగంపై అధికారులు కఠిన ఆంక్షలు విధించారు. పరీక్ష కేంద్రాలను 'నో సెల్‌ఫోన్' జోన్లుగా ప్రకటించారు. పరీక్ష సిబ్బంది, స్కాడ్ సహా ఇతర అధికారులందరికీ ఈ నిబంధనలు వర్తిస్తాయి. తనిఖీలకు వచ్చే అధికారులు సైతం సెల్‌ఫోన్లు తీసుకెళ్లరాదు. వీరు తమ సెల్‌ఫోన్లను గది బయటే పెట్టాల్సి ఉంటుంది. ఎవరొచ్చినా తనిఖీలు చేసిన తర్వాతే లోపలికి అనుమతిస్తారు. ఒకవేళ ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘించి సెల్‌ఫోన్లతో విధులకు హాజరైతే వారిని సస్పెండ్‌చేస్తారు. పేపర్ లీకేజీలకు పాల్పడితే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. పరీక్షలు జరుగుతుండగానే మూల్యాంకనం కూడా ప్రారంభం అవుతంది. ఈ నెల 14 నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనుండగా, ఏప్రిల్ 1 నుంచి జవాబపత్రాల మూల్యాంకనం జరుగనున్నది.

# రైతు భరోసాను రూ.12 వేలకే పరిమితం చేశారు

మొదటిపేజీ తరువాయి
ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల వల్ల విద్యార్థులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. పట్టణాల్లో కుక్కలు, కోతులు, పందుల బెడద నెలకొంది. మురుగు వ్యవస్థ సరిగా లేక అంటువ్యాధులు ప్రబలుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కనీస సౌకర్యాలు కరవయ్యాయి. ప్రతిపక్ష నేత కేసీఆర్ ప్రజల సమస్యలపై మాట్లాడే బాధ్యతను విస్మరించారు. తెలంగాణ ప్రజల గొంతుకగా భాజపా.. ఈ సమస్యలను మీ దృష్టికి తెస్తోంది" అని రామచందర్ రావు లేఖలో తెలిపారు.

# 'గ్యాస్ బ్లాక్ మార్కెట్‌పై చర్యలు తీసుకోండి'

మొదటిపేజీ తరువాయి
గ్యాస్ కొరత కారణంగా విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రధానంగా గ్యాస్ బ్లాక్ మార్కెట్ కారణంగానే ఈ పరిస్థితి వచ్చినట్లు కనబడుతోందని, ఈ బ్లాక్ మార్కెట్‌పై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు కేటీఆర్. ఈ మేరకు సిలిండర్ల తీవ్ర కొరతను పరిష్కరించడానికి వెంటనే జోక్యం చేసుకోవాలని కేంద్ర పెట్రోలియం శాఖామంత్రి హర్దీప్ సింగ్ పూరికి లేఖ రాశారు.
ఎల్పీజీ సిలిండర్ లభ్యతపై పారదర్శక సమాచారాన్ని అందించడానికి రియల్–టైమ్ పబ్లిక్ డాష్‌బోర్డ్‌ను రూపొందించాలని ఆయన సిఫార్సు చేశారు చిన్న వ్యాపారాలపై అదనపు ఆర్థిక భారాన్ని నివారించడానికి వాణిజ్య ఎల్పీజీ సిలిండర్లపై తాత్కాలిక ధరను నిర్ణయించి దానిని అమలు చేయాలన్నారు.

# బిఆర్ఎస్ ఫిరాయింపు ఎమ్మెల్యేల కకేసు క్లోజ్ స్పీకర్ నిర్ణయంతో ఏకీభవించిన సుప్రీం

తెలంగాణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపు కేసు విచారణ ఎట్టకేలకు ముగిసింది. రాష్ట్ర రాజకీయాల్లో కొన్నిరోజులుగా తీవ్ర కలకలం రేపిన ఈ కేసు విచారణను గురువారం నాడు సుప్రీంకోర్టు ముగించింది. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై నిర్ణీత గడువులోగా నిర్ణయం తీసుకోవాలని చెప్పినా.. స్పీకర్ నిర్ణయం తీసుకోలేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ గురువారం విచారణకు రాగా విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ దాఖలు చేసిన పిటిషన్లపై సుదీర్ఘ విచారణ అనంతరం ఉన్నత న్యాయస్థానం తుది తీర్పు వెలువరించింది . ఈ కేసును జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించగా.. స్పీకర్ తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించారు. ఎమ్మెల్యేల అనర్హతకు సంబంధించి దాఖలైన పిటిషన్లపై తెలంగాణ స్పీకర్ ఇప్పటికే విచారణ జరిపి, తగిన నిర్ణయం తీసుకున్నారని ఆయన కోర్టుకు వివరించారు. దీంతో ఈ సమస్య సభాపతి కార్యాలయంలోనే ముగిసిందన్నారు. సింఘ్వీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. ఈ వ్యవహారంపై స్పీకర్ ఇప్పటికే తుది నిర్ణయం తీసుకున్నందున విచారణ కొనసాగించాల్సిన అవసరం లేదని భావించింది. దీంతో కోర్టు విచారణ ముగిసినట్లేనని వెల్లడించింది. స్పీకర్ ఆదేశాలను రెండు రోజుల్లో అధికారికంగా ప్రచురించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆ తరువాత పిటిషనర్లకు కావాల్సిన డాక్యుమెంట్లను కూడా నాలుగు రోజుల్లో అందజేయాలని సూచించింది. దీంతో 10 మంది ఎమ్మెల్యేలకు సభాపతి క్లీన్ చిట్ ఇచ్చినట్లైంది. ఈ వ్యవహారంలో పదిమంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ఊరట దక్కింది. అయితే పోరాడిన బిఆర్ఎస్‌కు మాత్రం న్యాయం దక్కలేదని ఆ పార్టీ నేతలు వ్యాఖ్యానించారు. స్పీకర్ తీర్పుపై ఇప్టపికే బిఆర్ఎస్ తన నిరసన తెలియచేసింది. స్పీకర్ తీర్పును సవాల్ చేస్తామన్న బిజెపికి కూడా ఈ తీర్పుతో ఇక అవకాశం లేనట్లుగానే భావించాలి.

# జిహాదీల హత్యలకు మినహాయింపా?
# దళిత హిందువుల చావుకు నిరసన కూడా ఉండదా?

శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్

**గర్భ శోకంతో కార్చిన కన్నీళ్లు ఒక జాతిని సునామీ రూపంలో ముంచెత్తుతాయి ..**
**ఆ శాపం తప్పనిసరిగా మహా సంఘర్షణకు నాందీ వాక్యం అవుతుంది ..**
**దీనంగా చూస్తున్న ఈ ఫోటో ఎవరిదో తెలుసా?**
**.....**
**మొన్న,4 మార్చి 2026 రోజున ఢిల్లీ లోని ఉత్తమ్ నగర్ లో అన్యాయంగా ఒక దళిత హిందువును జిహాదీ మతోన్మాద మూకలు చంపేశాయి.**
**హోలీ రోజున జరిగిన ఒక దళిత హిందువు హత్య ఇది.**



పొరపాటున కొంచెం రంగు నీళ్లు ఒక ముస్లిం యువతిపై పడ్డందుకు, ఆ ఘటనతో తనకు ఏ సంబంధమూ లేకపోయినా, అనవసరంగా, అకారణంగా, అన్యాయంగా క్రూర జిహాదీ మూక, తనపై చేసిన దాడిలో మరణించిన తరుణ్ కుమార్ తండ్రిది.
నిస్సహాయుడైన ఒక తండ్రి ఫోటో అది.ఆ తండ్రి కళ్ల ముందే...తన కొడుకును ఒక కర్కశ మూక, దాడి చేసి కొట్టి చంపేస్తే? ఆ తండ్రి ఆ క్షణాన్ని ఎలా మరిచిపోగలడు?

- ఈ ఫోటోలో కనిపిస్తున్న ఆ తండ్రి ముఖాన్ని ఒక్కసారి గమనించండి...కంటి దగ్గర గాయం ఉంది

ఆ కళ్ళలో కన్నీటి తడి ఇంకా ఆరిపోలేదు.ఆయన నోట్లోంచి మాటలు పెగలడం లేదు.మౌనం ... భయంకరమైన నిశ్శబ్దం...అది ప్రళయం తర్వాత ఉండే భయంకరమైన నిశ్శబ్దమా?ప్రళయం కంటే ముందు ఉండే భయంకరమైన మౌనమా?

- అది కేవలం గాయం కాదు.అది ఒక కుటుంబం ఛిద్రమైపోయిన దృశ్యం

- తన కళ్ళ ముందే తన రక్తమాంసాలను పంచుకు పుట్టిన పిల్లాడు,దారుణంగా దెబ్బలు తింటూ, విలవిల్లాడుతూ... గిలగిల కొట్టుకుంటూ నేల కూలుతుంటే...ఒక తండ్రి నిస్సహాయంగా నిలబడి చూడాల్సి రావడం కంటే భయంకరమైన శాపం ఇంకేముంటుంది?

బిడ్డ పుట్టిన రోజున మొదటిసారి చేతిలోకి తీసుకున్నప్పుడు వచ్చిన ఆనందం...
ఆ బిడ్డ మొదటిసారి నడిచినప్పుడు వచ్చిన గర్వం...
మొదటిసారి "నాన్నా" అని పిలిచినప్పుడు వచ్చిన అనుభూతి...

- అన్నీ... అన్నీ... ఒక్క క్షణంలో రక్తపు మడుగులో కూలిపోతూ ఉంటే... అరక్షణంలో ఆవిరైపోతూ ఉంటే...ఆ తండ్రి హృదయం ఎంతగా తల్లడిల్లిపోయుంటుందో ఒక్కసారి ఆలోచించండి

ఈ సంఘటన, కేవలం ఒక కుటుంబంలో జరిగిన, ఒక కుటుంబానికి మాత్రమే పరిమితమైన విషాదం కాదు. మన సమాజం ముందు నిలచిన నిలువెత్తు ప్రశ్న...మన కళ్ళ ముందే మనలో ఒకడిపై... కసాయి మూకలు దాడి చేసి ..కర్కశంగా .. అమానుషంగా,రాళ్లతో... కర్రలతో... ఇనుప రాడ్లతో... కొట్టి... కొట్టి... కొట్టి... హింసించి చంపుతూ ఉంటే... మనం ఎందుకు మౌనంగా నిలుచున్నాం?

- ఆ దారుణానికి పాల్పడ్డవాళ్లు, వాళ్లకి సహకరించిన వాళ్ళు, వాళ్లని సమర్థించే వాళ్ళు....




జరిగిన దారుణాన్ని ఖండించడానికి మనసే రానివాళ్ళు,అసలు మనసన్నదే లేనివాళ్లు... ఇప్పటికీ... మన కళ్ళ ముందే... జంకూ గొంకూ లేకుండా... నిర్భయంగా... ఎలా తిరగ గలుగుతున్నారు?

ఇది మన అసహాయతా? మన చేతగానితనమా? ఇది ఇలాగే కొనసాగితే... మన బ్రతుకులు ఏమవుతాయి?

మన ఆడపిల్లలు వీధుల్లో తిరగ్గలరా?
మనం పండుగలు చేసుకోగలమా?
మన బిడ్డల భవిష్యత్తు భద్రంగా ఉన్నట్టేనా?
మనం జీవితాంతం కష్టపడి సంపాదించుకున్న ఆస్తులను మనం కాపాడుకోగలమా?
ఒక ప్రశ్న కాదు... వేల ప్రశ్నలు... వేల వేల ప్రశ్నలు...
మనల్ని తూట్లు పొడుస్తూ... తుత్తునియలు చేస్తూ...

- అసలు ఆ మూకకి ప్రాణం తీసే హక్కు ఎవరిచ్చారు? ఎక్కడిది వాళ్ళకంత ధైర్యం?

ఒక చిన్న ఘర్షణ ఎలా ప్రాణహానిగా మారింది? అసలు రంగు పడితే ఏమవుతుంది?

హిందూ పండుగలపై వాళ్లకి అంత అసహనం ఎందుకు? అసలు అంతటి అనాగరిక, అసహన మత మౌఢ్యులతో కలిసి నాగరిక మానవ సమూహాలు మనుగడ సాగించడం సాధ్యమేనా?

- ఒక నిర్దోషి అయిన దళిత హిందూ సోదరుడి ప్రాణం పోయినప్పుడు న్యాయం ఎక్కడ ఉంది?

- మానవ హక్కుల సంఘాలు, దళిత సంఘాలూ, పౌర హక్కుల సంఘాలూ ఏమైపోయాయ్? ఎక్కడికి మాయమైపోయాయ్?

అలజడి సంగతి తర్వాత... అసలు అలికిడైనా చెయ్యవే?
ఒక తండ్రి జీవితాంతం మోయాల్సిన గాయం ఇది...కాలం గడుస్తుంది...సంవత్సరాలు మారతాయి.సంక్రాంతి... వినాయకచవితి... దీపావళి... హోలీ...పండుగలు ప్రతి ఏడూ వస్తాయి... పోతాయి...కానీ అతని కళ్ల ముందే నేల కూలిపోయిన అతని కొడుకు రూపం...ఆ తండ్రి మనసులోంచి ఎప్పటికీ పోదు...
ఆ గాయం మానేదెలా? ఆ వేదన తీరేదెలా?

- హిందువులను కులాలుగా విడదీసే కుట్ర చేస్తున్నది ఎవరు?

కుల వివక్ష పోరాట సమితి..అంటూ..
కుల నిర్మూలన సంఘం .. అంటూ..
సింపోజియం లు, చర్చా వేదికలు పెట్టే వారు, సమావేశాలు,సభలు పెట్టేవారు,ఎక్కడికి పోయారు.
కుల మత వివక్ష ఉండకూడదు అంటూ ఉపన్యాసాలు ఇచ్చేవారు, మత భేదాలు ఉండకూడదు అని నీతులు బోధించేవారు..
దళిత సోదరుడైన తరుణ్ ను ఎందుకు చంపారు?
దళిత కులానికి చెందినవాడు అని చంపారా?
ఒక హిందువు అని చంపారా?
తరుణ్ ను చంపిన వారు మైనారిటీ వర్గానికి చెందిన జిహాదీయులు అని దళిత సంఘాలు ఉపేక్షిస్తున్నాయా? జిహాదీయులకు దళితులను చంపే హక్కు ఉందా?

- **అసలు మనిషి మేధస్సుకు ఏమైంది?**

**కులమత వివక్షను చూపుతున్నది ఎవరు?**
అసలు మతోన్మాదులు ఎవరు?
మైనారిటీ బుజ్జగింపు ధోరణితో సెలెక్టివ్ గా మాట్లాడే వాళ్లే నిజమైన మతోన్మాదులు.
ఓట్ల కొరకు కులాలను ఎగదోసి అధికారము అనుభవించాలనుకునేవారు నిజమైన మతోన్మాదులు.
సమాజంలో సామరస్య ధోరణిని తృణీకరించి ఓట్ల కొరకు మైనారిటీ మతవాదాన్ని ప్రోత్సహించేవారు నిజమైన మతోన్మాదులు. భారతదేశంలో సెక్యులర్ నీతి పేరుతో జరుపుతున్న రాక్షస రాజకీయ క్రీడ సామాన్య జనానికి అర్థమవుతున్నది.భారతదేశ యువతరం "జన్ జెడ్" ఈ వివక్షను రూపుమాపి తీరుతుంది.

- రాజకీయ అధికారం కొరకు కుల మతాలను ప్రోత్సహించే రాజకీయాలు నశించాలి.

మతోన్మాద కుటిల రాజకీయ నాయకులు నశించాలి

## కుత్బుల్లాపూర్ జోన్ సమస్యలపై జోనల్ కమిషనర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్

కుత్బుల్లాపూర్, మార్చి 12 కరపత్రం ప్రతినిధి

కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారం అభివృద్ధి కార్యక్రమాల వేగవంతానికి సంబంధించి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్ గురువారం జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జోనల్ కమిషనర్‌ను ఆయన కార్యాలయంలో కలిసి, కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని 24 డివిజన్లలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు, సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు, అలాగే అత్యవసరంగా చేపట్టవలసిన కొత్త పనులపై పలు వినతిపత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ పింకేష్ కుమార్ స్పందిస్తూ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న సమస్యలను ప్రాధాన్యతగా పరిగణించి దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారులు సమన్వయంతో పని చేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ, కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై జోనల్ కమిషనర్ సానుకూలంగా స్పందించారని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు చొరవ చూపి త్వరితగతిన పనులు పూర్తి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్లు, మాజీ కౌన్సిలర్లు, ఐఎన్‌టీయూసీ నాయకులు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, వివిధ కాలనీల అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, మున్సిపల్ అధికారులు, అలాగే కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చిన్నారుల్లో విద్యాపట్ల ఆసక్తి పెంపొందించాలి: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

» జగద్గిరిగుట్ట ఇన్ఫాంట్ జీసస్ స్కూల్‌లో ప్రీ--ప్రైమరీ 'గ్రాడ్యుయేషన్ డే' కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే -- విద్యార్థులకు మెడల్స్, ప్రశంసా పత్రాల ప్రదానం

కుత్బుల్లాపూర్, మార్చి 12 కరపత్రం ప్రతినిధి

పిల్లల్లో చిన్నప్పటి నుంచే విద్యాపట్ల ఆసక్తి పెంపొందేలా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని బీఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 126వ డివిజన్ జగద్గిరిగుట్టలో ఉన్న ఇన్ఫాంట్ జీసస్ స్కూల్‌లో ప్రీ--ప్రైమరీ విద్యార్థుల కోసం నిర్వహించిన 'గ్రాడ్యుయేషన్ డే' కార్యక్రమానికి ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారులకు మెడల్స్, ప్రశంసా పత్రాలు




అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది చిన్నప్పటి నుంచే వేయాల్సిన అవసరం ఉందన్నారు. పిల్లల్లో విద్యాపట్ల ఆసక్తి పెంపొందించడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ప్రతిరోజూ పిల్లలతో కొంత సమయం గడిపి వారికి సరైన మార్గనిర్దేశం చేస్తే, తల్లిదండ్రులు--పిల్లల మధ్య అనుబంధం మరింత బలపడటంతో పాటు క్రమశిక్షణ, మంచి సంస్కారం అలవడతాయని తెలిపారు. ఇలా సరైన మార్గదర్శకత్వంతో పెరిగిన పిల్లలు భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహించి సమాజానికి ఉపయోగపడే వ్యక్తులుగా ఎదుగుతారని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ఈ కార్యక్రమంలో రెవరెండ్ ఫాదర్ ఏరువ బాల సుధీర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ జగన్, డివిజన్ అధ్యక్షుడు రుద్ర అశోక్, శ్రీ వెంకటేశ్వర దేవస్థానం మాజీ చైర్మన్ వేణు యాదవ్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేష్ యాదవ్, సీనియర్ నాయకులు ఎండి. ఆజం, బ్రహ్మానంద్ చారి, ఇందిరా గౌడ్, మెట్ల శ్రీను, ఖయూమ్, కోల శ్రీకాంత్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రావుల శేషగిరి

» పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుకు కృతజ్ఞతలు ౖ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ సహా పార్టీ పెద్దల మద్దతుతో బాధ్యతలు సమర్థంగా నిర్వహిస్తానని హామీ

కుత్బుల్లాపూర్, మార్చి 12 కరపత్రం ప్రతినిధి

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మున్సిపల్ సెల్ కో-కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టే అవకాశం కల్పించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావుకు మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం



విడుదల చేసిన ప్రకటనలో పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనకు అప్పగించిన ఈ కీలక బాధ్యతను గౌరవంగా స్వీకరిస్తున్నానని తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే నిరంతరం ప్రోత్సాహం అందిస్తూ మద్దతు ఇస్తున్న పార్టీ పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యంగా మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ రంగంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై పార్టీ తరపున చురుకుగా స్పందిస్తూ, మున్సిపల్ పాలనలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చేలా కార్యక్రమాలు చేపడతానని తెలిపారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తన లక్ష్యమని, నాయకత్వం ఇచ్చిన బాధ్యతలకు న్యాయం చేసేలా తన శక్తి మేరకు పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ విభాగంలో పార్టీ కార్యకలాపాలను మరింత విస్తరింపజేయడానికి చర్యలు చేపడతానని రావుల శేషగిరి వెల్లడించారు.

## ఢిల్లీ మద్యం కేసు.. కవితకు సీబీఐ నోటీసులు

హైద్రాబాద్ మార్చ్ 12 కరపత్రం ప్రతినిధి

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితకు (Kavita) సీబీఐ అధికారులు ఈ నెల తేదీ (గురువారం) నోటీసులు జారీ చేశారు. కవితతో పాటు అరుణ్ రామచంద్ర, అభిషేక్ బోయిన్‌పల్లి, శరత్ రెడ్డి, మాజీ ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డిలకు ఢిల్లీ మద్యం కేసుకు సంబంధించి నోటీసులు జారీ చేశారు. ఇటీవల ఇదే కేసులో ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు కవితకు క్లీన్‌చిట్ ఇచ్చినప్పటికీ, ఆ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. హైకోర్టులో పిటిషన్ దాఖలైన నేపథ్యంలోనే సీబీఐ అధికారులు మళ్లీ రంగంలోకి దిగడం గమనార్హం.? కవిత అనారోగ్యంతో ఉండటంతో ఆమె భర్త అనిల్‌కి నోటీసులు అందజేశారు. ఈ నెల 16వ తేదీన ఢిల్లీ హైకోర్టులో విచారణ ఉందని సీబీఐ అధికారులు తెలిపారు. ఇప్పటికే ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేశారు. అయితే, ఈ నోటీసులపై కవిత అనుచరులు తీవ్రంగా స్పందించారు. ఒకసారి కోర్టు క్లీన్‌చిట్ ఇచ్చిన తర్వాత మళ్లీ నోటీసులు ఇవ్వడం కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని ఆరోపించారు. చట్టంపై తమకు గౌరవం ఉందని, నిజం గెలుస్తుందని కవిత మొదటి నుంచి చెబుతున్నారని అన్నారు. ఈ నోటీసులకు కూడా చట్టబద్ధంగానే సమాధానం ఇస్తామని కవిత అనుచరులు పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసు ఢిల్లీ హైకోర్టు పరిధిలో ఉన్నందున, మార్చి 16వ తేదీన జరిగే తదుపరి విచారణ అత్యంత కీలకం కానుంది. క్లీన్‌చిట్ నిలబడుతుందా లేదా మళ్లీ విచారణ ఎదుర్కోవాల్సి ఉంటుందా అనేది వేచి చూడాలి..




## ఆలయ నిర్మాణానికి విరాళం అందజేసిన తుంగతుర్తి రవి




మేడిపల్లి, కరపత్రం ప్రతినిధి

మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ 9వ డివిజన్ మేడిపల్లి పరిధిలోని సాయి ప్రియ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామ స్వామి (శివాలయం మరియు రామాలయం) దేవాలయ నిర్మాణ పనుల కోసం పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ఆర్ వి ఫౌండేషన్ చైర్మన్ తుంగతుర్తి రవి విరాళాన్ని అందచేశారు.?గురువారం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను కలిసారు , ఆలయ నిర్మాణానికి తన వంతు సహాయంగా రూ. 1,00,116/- (లక్షా నూట పదహారు రూపాయలు) అందజేశారు. ఈ సందర్భంగా తుంగతుర్తి రవి గారు మాట్లాడుతూ:
"దైవ చింతన సమాజంలో శాంతిని, ఐకమత్యాన్ని పెంపొందిస్తుంది. సాయిప్రియనగర్ ప్రాంత భక్తుల చిరకాల వాంఛ అయిన ఈ ఆలయ నిర్మాణంలో భాగస్వామ్యం కావడం నా అదృష్టంగా భావిస్తున్నాను. ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆర్ వి ఫౌండేషన్ ఎల్లప్పుడూ ముందుంటుంది," అని పేర్కొన్నారు.తమ పిలుపు మేరకు స్పందించి, ఆలయ అభివృద్ధికి సహకరించినందుకు దేవస్థాన కమిటీ సభ్యులు తుంగతుర్తి రవి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు మరియు కాలనీ వాసులు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
శుక్రవారం మార్చి 13, 2026

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలులో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం,

**•మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్,**





కరపత్రం ప్రతినిధి మంచిర్యాల జిల్లా మార్చి 12, 2026: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలులో ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమైనదని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో గల అమ్మ గార్డెన్స్ లో గ్రామపంచాయతీ సర్పంచ్ లు, మున్సిపల్ కార్పొరేషన్/మున్సిపాలిటీ మేయర్/చైర్ పర్సన్ లు, డిప్యూటీ మేయర్/ వైస్ చైర్ పర్సన్ లు, కార్పొరేటర్లు/ కౌన్సిలర్లకు 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమానికి మంచిర్యాల డి సి పి ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మాట్లాడుతూ స్థానిక సంస్థలు, మున్సిపల్ ఎన్నికలు నిర్వహించి ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం జరిగిందని, ఈ క్రమంలో విధులు, అధికారాలపై గ్రామపంచాయతీల సర్పంచ్లకు శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని, పంచాయితీ రాజ్ చట్టాలు వివరించడం జరిగిందని తెలిపారు. మార్చి 6 నుంచి జూన్ 12వ తేదీ వరకు 99 రోజుల పాటు ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి లలో కార్యచరణ అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో పారిశుధ్యం, ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న పైళ్ల క్లియరెన్స్ తదితర అంశాలపై కార్యాచరణ, సమాజ హిత అంశాలపై ప్రణాళికలు అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అమలు చేయడంలో ప్రజా ప్రతినిధులు తీసుకోవలసిన చర్యల గురించి తెలుసుకోవాలని తెలిపారు. తెలంగాణ పంచాయతీరాజ్ ఌ మున్సిపల్ యాక్ట్ ల గురించి ప్రజాప్రతినిధులకు సంక్షిప్తంగా వివరించడం జరుగుతుందని తెలిపారు. విద్యా రంగ అభివృద్ధి దిశగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సౌకర్యార్థం మౌలిక వసతులు, విద్యుత్, త్రాగునీరు, మూత్రశాలలు, ప్రహరీ గోడ నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టడం జరిగిందని, ఇందులో భాగంగా ఉపాధి హామీ క్రింద పనులు చేయడం జరిగిందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలను అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ అభివృద్ధి పనులలో భాగస్వామ్యలను చేయడం జరిగిందని తెలిపారు. రేషన్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్నట్లయితే క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన లబ్ధిదారులకు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలలో నెలకొన్న సామాజిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని తెలిపారు. నిరుద్యోగ యువత భవిష్యత్తు దృష్ట్యా మాదకద్రవ్యాల నిరోధకం, మద్యం వినియోగంపై ప్రజా ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 2, 3 వార్డులలో 3, 4 రోజుల పాటు పారిశుధ్యం, త్రాగునీటి పైప్ లైన్ల మరమ్మత్తు, ఇతర పనులు చేపట్టడం జరుగుతుందని, ప్రజా ప్రతినిధులు కార్యక్రమాలలో పాల్గొని ప్రజలను భాగస్వామ్యులను చేయాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా ప్రతి రోజు ప్రతి ఇంటి నుండి చెత్త సేకరణ నిరంతరాయంగా కొనసాగించాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలలో ఒకసారి లబ్ధి పొందిన వారిని గుర్తించాలని, మరల లబ్ధిదారుల జాబితాలో వారి వివరాలు లేకుండా జాగ్రత్త వహించాలని, తద్వారా అర్హత గల మిగిలిన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరుతుందని, ప్రభుత్వ లక్ష్యాలు విజయవంతం అవుతాయని తెలిపారు. రహదారి ప్రమాదాల నివారణలో భాగంగా ప్రతి ఒక్కరు రహదారి భద్రత నియమాలను పాటించే విధంగా ప్రజాప్రతినిధులు వారి పరిధిలో అవగాహన కల్పించాలని తెలిపారు. మున్సిపల్ పాలకవర్గం ఏర్పాటు చేయబడినందున మున్సిపల్ అభివృద్ధి కొరకు నిధులు మంజూరు అవుతాయని, ఈ నిధులను సక్రమంగా వినియోగిస్తూ ప్రజా ప్రయోజనకర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. వేసవిలో ప్రజలకు నిరంతరం నీటిని సరఫరా చేసే విధంగా ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాలను ప్రజాప్రతినిధులు తమ పరిధిలో పకడ్బందీగా అమలు చేయాలని, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. విద్యుత్ దీపాల ఏర్పాటులో సౌర విద్యుత్ దీపాల ఏర్పాటుపై దృష్టి సారించాలని, తద్వారా విద్యుత్ వినియోగాన్ని నియంత్రించవచ్చని తెలిపారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం అమలులో ప్రజా ప్రతినిధుల విధులు, అధికారాలు తెలుసుకొని ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసి ప్రజాసంక్షేమం ఉందిగా కృషి చేయాలని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం అమలులో ప్రజా ప్రతినిధుల పాత్ర కీలకమైనదని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులు ఆన్ లైన్ లో మాత్రమే గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోవాలి,

**•మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. శ్రీనివాస్ రావు,**



కరపత్రం ప్రతినిది న్యూస్ మంచిర్యాల జిల్లా మార్చి 12, 2026: గ్యాస్ వినియోగదారులు ఆన్ లైన్ లో మాత్రమే సిలిండర్లను బుక్ చేసుకోవాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) జి. శ్రీనివాస్ రావు తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్ లో ఎల్ పి జి డీలర్లతో అత్యవసర సమావేశం నిర్వహించి గ్యాస్ కంపెనీల సేల్స్ అధికారులతో ఫోన్ ద్వారా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్( రెవెన్యూ)జి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రస్తుతం మంచిర్యాల జిల్లాలో గృహ అవసరాల కోసం వినియోగించే డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, వినియోగదారులు గ్యాస్ ఏజెన్సీలు, గోదాముల వద్దకు వెళ్లకుండా ఆన్ లైన్ లో మాత్రమే సిలిండర్లను బుక్ చేసుకోవాలని తెలిపారు. గ్యాస్ బుకింగ్ సమయం సింగిల్ సిలిండర్ వారికి 25 రోజులు, డబుల్ సిలిండర్ వారికి 30 రోజుల వ్యవధి ఉంటుందని తెలిపారు. గ్యాస్ డెలివరీ చేసే సమయంలో వినియోగదారులు డెలివరీ బాయ్ కు ఓ టి పి చెప్పి సహకరించాలని, హోటల్, రెస్టారెంట్లలో వాణిజ్య సిలిండర్ మాత్రమే ఉపయోగించాలని, నిబంధనలకు విరుద్ధంగా డొమెస్టిక్ సిలిండర్లు ఉపయోగించినట్లయితే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్యాస్ సిలిండర్ల విషయంలో ఎవరైనా కృత్రిమ కొరతను సృష్టించి, బ్లాక్ మార్కెట్ లో సిలిండర్లను విక్రయించాలని చూస్తే నిత్యవసరల సరుకుల చట్టం 1955 క్రింద కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎల్ పి జి వినియోగదారులు కె వై సి తప్పనిసరిగా చేసుకోవాలని, గ్యాస్ ఏజెన్సీ ల వద్ద, ఆన్ లైన్, గ్యాస్ కంపెనీ అధికారిక వెబ్సైట్, యాప్ లో, గ్యాస్ సిలిండర్ పంపిణీ సమయంలో గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకుల వద్ద పూర్తి చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా దినోత్సవ సభలో మాట్లాడుతున్న జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షులు రాంబాబు

కరపత్రం ప్రతినిది న్యూస్ మార్చి 13 సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ నియోజకవర్గం



విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో మహిళలు రాణించాలని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షులు బొల్లు రాంబాబు అన్నారు. గురువారం హుజూర్నగర్ ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి మహిళా పెన్షనర్ ఎస్ రాధా దుర్గా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ సమాజంలో మహిళలకు మరింత గౌరవం పెరగాలన్నారు. మహిళల పట్ల అక్కడక్కడ కొనసాగుతున్న వివక్షను రూపుమాపాలన్నారు. మహిళల వల్లనే కుటుంబాలకు గొప్ప పేరు లభిస్తున్నట్లు వెల్లడించారు. మహిళలు సాధికారత సాధించటానికి పురుషులు సహకరించాలని కోరారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ కల్పించినప్పుడే వివక్షత రూపుమాపుతుందని అభిప్రాయపడ్డారు. సమావేశంలో జిల్లా పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు విద్యాసాగర్ రావు, స్థానిక మహిళా పెన్షనర్లు ఎస్ లలిత, టి విజయ మేరీ, చెన్న సౌభాగ్య, ఏ సుధారాణి, బి రామలక్ష్మి, థెరీసా, శ్రీలత, అంకతి అప్పయ్య, రఘునాథ్, ధర్మరి వెంకటేశ్వర్లు, పారుపల్లి చంద్రశేఖర్, ఎం ఎస్ ఎన్ రాజు ,చెన్నా సైదులు, కే లక్ష్మయ్య, ఏ చంద్రయ్య, ఎంబి దేవదానం తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు మహిళా పెన్షనర్లు జ్యోతి ప్రజ్వలన చేసి కేక్ కట్ చేశారు. నకార విగ్రహానికి పూలమాల వేశారు. సమావేశ నిర్వహణ మొత్తం మహిళలకే అప్పగించటం పట్ల

## విద్యార్థి బి. రంగప్పకు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అభినందనలు

మల్కాజిగిరి కరపత్రం ప్రతినిది న్యూస్ మార్చ్12



మల్కాజిగిరి: మన విద్యార్థుల ప్రతిభకు ఆకాశమే హద్దు అని మరోసారి నిరూపితమైంది. 2025-26 ఇన్స్పైర్ మనక్ అవార్డుకు నామినేట్ అయిన 8వ తరగతి విద్యార్థి బి. రంగప్పను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ప్రాజెక్ట్ పరిశీలన రంగప్ప రూపొందించిన సైన్స్ ప్రాజెక్ట్ వివరాలను ఎమ్మెల్యే ఆసక్తిగా విన్నారు.కళాశాల సహకారం విద్యార్థి ప్రతిభను గుర్తించిన ఎమ్మెల్యే, వెంటనే తన ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ డిపార్ట్మెంట్ హెచ్ ఓ డి తో మాట్లాడారు. విద్యార్థి అన్వేషణకు మద్దతుగా నిలవాలని, ప్రోటోటైప్ తయారీలో పాఠశాలతో సహకరించాలని సూచించారు.
ఈ కార్యక్రమాన్ని మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ దగ్గరుండి సమన్వయం చేశారు.
ఈ సమావేశంలో కరస్పాండెంట్ పి. రవి కిరణ్, హెడ్ మాస్టర్ సి హెచ్ ఉషా రాణి, మెంటర్ మరియు ఫిజిక్స్ టీచర్ జి. అశోక్ మరియు విద్యార్థి తల్లిదండ్రులు పాల్గొని సంతోషాన్ని వ్యక్తం చేశారు

## డ్రైనేజీ సమస్యతో నరకయాతన

**రోడ్లు వేయాలని ప్రజల ఆవేదన**

హైదరాబాద్ కరపత్రం ప్రతినిది న్యూస్: సికింద్రాబాద్ నియోజకవర్గంలోని సీతాఫల్మండి మేడి బావి లో నెలకొన్న డ్రైనేజీ సమస్యతో స్థానిక ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అండర్ గ్రౌండ్ వ్యవస్థ కాలువలు సరిగా లేకపోవడంతో మురుగునీరు రోడ్డు మీద నిల్వ ఉండి దుర్వాసన వ్యాప్తిస్తుంది. దానివల్ల దోమలు విపరీతంగా పెరిగి ప్రజలు వ్యాధుల పాలవుతున్నారు. రోజురోజు పరిస్థితి మరింత దారుణంగా మారుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవటం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేడి బావి లోని ఈ గల్లీలో సరైన రోడ్డు కూడా లేకపోవడంతో వర్షాలు పడినప్పుడు డ్రైనేజీ పొంగినప్పుడు బురదగా మారి రాకపోకలకు పూర్తిగా ఇబ్బందులుగా మారుతున్నాయి. చిన్నపిల్లలు వృద్ధులు బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పై స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదివరకే ఎన్నోసార్లు పత్రిక



మాధ్యమాల్లో వచ్చినప్పటికీ అధికారులకు ఎంత నిర్లక్ష్యమాని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వెంటనే డ్రైనేజీ సమస్యను పరిష్కరించి, రోడ్లు వేయాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని ఎన్నికల సమయంలో అధికారులకు తామేంటోని చూపిస్తామని హెచ్చరించారు..

## మై భారత్ (మేరా, యువ, భారత్) మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో క్లస్టర్ బ్లాక్ స్థాయి క్రీడా పోటీలు





కరపత్రం ప్రతినిది న్యూస్ మంచిర్యాల జిల్లా మార్చి 12: మై భారత్ ( మేరా, యువ, భారత్,) మంచిర్యాల జిల్లా ఆధ్వర్యంలో మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాలలో క్లస్టర్ బ్లాక్ స్థాయి క్రీడా పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలలో కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా రన్నింగ్, షటిల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ క్రీడా పోటీలు ఈరోజుతో పాటు రేపు కూడా కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని కళాశాల ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ డా. ఎస్. నరేందర్ రెడ్డి ప్రారంభించారు. క్రీడల నిర్వహణను స్పోర్ట్స్ ఇన్చార్జ్ డా. ఆర్. గోపాల్ కృష్ణ సమన్వయం చేశారు. కళాశాల అధ్యాపకులు మరియు సిబ్బంది క్రీడా పోటీల నిర్వహణలో సహకరించారు.విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించాండి కమీషనర్‌కు విన్నవించిన ఎన్. అనురాధ

**డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల వద్ద డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కమీషనర్‌కు లేక**

**ఎస్ టి పి మూలపడటంతో డ్రైనేజీ నీరు రోడ్లపై నిలిచిపోయినయి**



మల్కాజిగిరి కరపత్రం ప్రతినిది న్యూస్ మార్చ్ 12

మల్కాజిగిరి/కీసర: అహ్మద్‌గూడ డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులు ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యపై ఎన్. అనురాధ మల్కాజిగిరి మునిసిపల్ కమీషనర్ టి. వినయ్ కృష్ణ రెడ్డి ని కలిసి వినతిపత్రం సమర్పించారు.?గత నెల రోజులుగా సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఎస్ టి పి మూలపడటంతో డ్రైనేజీ నీరు రోడ్లపై నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోందని, దోమల వ్యాప్తి వల్ల స్థానికులు రోగాల బారిన పడుతున్నారని ఆమె కమీషనర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను అర్థం చేసుకున్న కమీషనర్ వారు వెంటనే మునిసిపల్ ఈఈ తో మాట్లాడి, అహ్మద్‌గూడ క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. లబ్ధిదారుల కష్టాలను గుర్తించి వెంటనే స్పందించిన అధికారులకు, అనురాధ కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

## సర్పంచ్ ఎన్నికల్లో గెలిచిన ఓడిన ఆడబిడ్డలకు ఇచ్చిన చందు అన్న కానుక హామీ నెరవేర్చిన జనసేన పార్టీ ఇంచార్జి :కొర్ర చందు నాయక్

కరపత్రం ప్రతినిదిన్యూస్ మర్చి 12.దేవరకొండ. జిల్లా నల్గొండ



దేవరకొండ పట్టణం కోర్ర తండ గ్రామపంచాయతీ ఆడబిడ్డకు చందు అన్న కానుక కోర్ర తండా గ్రామపంచాయతీ లో ఏ ఆడబిడ్డకైనా పెళ్లి జరిగితే సర్పంచ్ గా గెలిస్తే 5016 రూపాయలు ఓడితే 2016 రూపాయలు మేనిఫెస్టో పెట్టిన ప్రకారంగా కొర్ర తండా గ్రామంలో ఆడబిడ్డకు కానుకగా ఇస్తానన్న మాటను ఓటమి పాలైన తప్పకుండా కొర్రతండ గ్రామంలో జరిగిన ఆడబిడ్డ వివాహంకు చందు అన్న కానుక 2016 అందజేశారు గ్రామాల్లో జరిగిన ప్రతి ఆడబిడ్డకి చందు అన్న కానుకగా అందజేయడం జరిగింది ఓడిన గెలిచిన ఇచ్చిన మాట జనసైనికులు తప్పరు పేదంటి ఆడబిడ్డలకు చందు అన్న కానుకగా వారికి నా వంతుగా వారికి అందాలనేదే లక్ష్యం అని చందు నాయక్ అన్నారు ఈ కార్యక్రమంలో కొర్ర తండా గ్రామ పెద్దలు టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చందు, మోహన్ నాయక్ మాజీ ఎంపిటిసి బిక్కు నాయక్ రాజు శ్రీను తదితరులు పాల్గొన్నారు